సాక్షి
రంగారెడ్డి
సోమవారం : 20 : మే : 2024



నక్ష బాట కబ్జాకు యత్నం

ఎన్నో ఏళ్లుగా నడిచే రోడ్డును కొందరు కబ్జా చేయడానికి యత్నించగా, రైతులు నిరసన తెలపడంతో నిలిచిపోయింది. 8లో▸

న్యూస్‌రీల్

బెల్టు షాపులు ఎత్తివేయండి

నడిరోడ్డుపై చిన్నారులతో కలిసి యువకుడి నిరసన



షాద్‌నగర్‌: ఊళ్లో ఎక్కడ చూసినా బెల్టు దుకాణాలు వెలిశాయి.. ఏ గల్లీకి వెళ్లినా కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్నారు. దీంతో చాలామంది మద్యానికి బానిసై అనారోగ్యానికి గురవుతున్నారని, బెల్టు దుకాణాలు ఎత్తివేయాలని కోరుతూ ఓ యువకుడు ఆదివారం ఫరూఖ్‌నగర్‌ మండలం కందివనంలో చిన్నారులతో కలిసి వినూత్న నిరసన చేపట్టాడు. కొన్ని రోజులుగా గ్రామంలో బెల్టు దుకాణాల్లో జోరుగా మద్యం విక్రయిస్తున్నారని, మద్యానికి బానిసై చాలా మంది వృద్ధులు, యువకులు అనారోగ్యం బారిన పడుతున్నారని నిరసనకు దిగిన నవీన్‌ ఆందోళన వ్యక్తం చేశాడు. బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయించొద్దని కోరినా ఎవరూ వినడం లేదని.. దీంతో గ్రామ ముఖ్య కూడలిలో చిన్నారులతో కలిసి ఖాళీ మద్యం సీసాలతో నిరహార దీక్ష చేపట్టినట్లు తెలిపాడు. గ్రామంలో బెల్టు దుకాణాలు ఎత్తివేసే వరకు దీక్ష కొనసాగిస్తానని స్పష్టం చేశాడు. విషయం తెలుసుకున్న మహిళలు నవీన్‌ చేపట్టిన దీక్ష వద్దకు వచ్చి మద్దతు తెలిపారు.

తల్లిదండ్రులకు పాదపూజ



ఆమనగల్లు: వందేమాతరం ఫౌండేషన్‌, శృతిలయ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో నిర్వహిస్తున్న వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రుల కాళ్లు కడిగి పాదపూజ చేశారు. కార్యక్రమానికి వందేమాతరం ఫౌండేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్మ మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్‌ జిల్లా అధ్యక్షుడు బట్టు నర్సిరెడ్డి, వ్యవస్థాపకులు చిత్తరంజన్‌ దాస్‌, కార్యదర్శి విజయ్‌కుమార్‌, మాజీ ఎంపీపీ వెంకటయ్య, లయన్స్‌ క్లబ్‌ ఉపాధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం



మహేందర్‌రెడ్డి (ఫైల్‌)

చేవెళ్ల: అప్పుల బాధతో ఓ రైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్ల మండలం పలుగుట్ట గ్రామానికి చెందిన పులగుర్ల మహేందర్‌రెడ్డి (42) వారసత్వంగా వచ్చిన రెండు ఎకరాల భూమిని సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామంలోనే ఇతర రైతుల భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తుండేవాడు. సొంత భూమిలో బోరుబావి ఉండటంతో పూలసాగుతోపాటు ఇతర కూరగాయల పంటలు సాగు చేస్తున్నాడు. రెండుమూడేళ్లుగా వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో పంటల కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. తీర్చే దారి కనిపించకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం నుంచి సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు చూసే సరికి విగతజీవిగా మారాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలి

గన్‌ఫౌండ్రీ: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య డిమాండ్‌ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్‌ ప్రెస్‌ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని కోరారు. సమగ్ర కులగణన చేసి రిజర్వేషన్లను అమలు చేస్తామని తెలిపిన కాంగ్రెస్‌ పార్టీ.. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల్లో అమలు చేయాలని డిమాండ్‌ చేశారు.

అడ్డ 'దారులు'!

రియల్టర్ల ఇష్టారాజ్యం

- దర్జాగా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- రైతులు, ఆలయాల పేరుతో రోడ్లు
- అడ్డుకోవాల్సిన అధికారులే కొమ్ముకాస్తున్న వైనం



కుంట్లూరు - తట్టి అన్నారం మార్గం నుంచి ప్రభుత్వ భూమిలో వేసిన రోడ్డు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రియల్టర్ల ఆక్రమణ పర్వంతో సర్కారు భూములు కరిగిపోతున్నాయి. ప్రజావసరాలకు ఉపయోగపడాల్సిన రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం కుంట్లూరు, మొయినాబాద్‌ మండలం కనకమామిడి, చేవెళ్ల మండలం ఎన్కేపల్లి, ఇబ్రహీంపట్నం మండలం నెర్రవల్లి, హయత్‌నగర్‌ మండలాల్లో ఈ తతంగం యథేచ్ఛగా సాగుతోంది. కొంత మంది రియల్టర్లు ప్రభుత్వ భూముల పక్కన ఉన్న పట్టా భూములు కొనుగోలు చేస్తున్నారు. ఫాంహౌస్‌లు, వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా భూముల్లోకి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో పక్కనే ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేస్తున్నారు. రైతులు, దేవాలయాల పేరు చెప్పి ప్రభుత్వానికి అర్జీలు పెడుతున్నారు. క్షేత్రస్థాయిలోని రెవెన్యూ అధికారులు సదరు రియల్టర్లతో కుమ్మక్కై.. వారు అడిగిందే తడవుగా ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు రాసిచ్చేస్తున్నారు. సదరు రియల్టర్లు ఆయా వెంచర్లు పట్టణానికి, ప్రధాన రహదారికి అతి సమీపంలో ఉన్నట్లు బ్రోచర్లు ముద్రించి ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. ఇటు ప్రభుత్వాన్నే కాదు అటు కొనుగోలు దారులను మోసం చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని..

- మొయినాబాద్‌ మండలం కనకమామిడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్‌ 510లో ప్రభుత్వ భూమి ఉంది. ఓ రియల్టర్‌ ఆ పక్కనే 50 ఎకరాల పట్టా భూములు కొనుగోలు చేశాడు. రైతుల పేరుతో రూ.50 కోట్ల విలువ చేసే మూడు ఎకరాల ప్రభుత్వ భూమి నుంచి ప్రైవేటు వెంచర్‌కు సీసీ రోడ్డు వేసుకున్నాడు. ఎకరాల్లో కొనుగోలు చేసిన ఈ భూములను ఫాంహౌస్‌ పేరుతో గుంటలుగా విభజించి కొనుగోలు దారులకు రిజిస్ట్రేషన్లు కూడా చేశాడు. భూమి చుట్టూ ప్రీకాస్ట్‌ ప్రహరీ సహా భారీ ప్రవేశ ద్వారం, క్లబ్‌ హౌస్‌ నిర్మాణం చేపట్టాడు. కళ్లముందే ప్రభుత్వ భూమి కరిగిపోతున్నా పట్టించుకున్న నాథుడు లేడు.
- చేవెళ్ల మండలం ఎన్కేపల్లి శివారులోని సర్వే నంబర్‌ 45లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ గజం రూ.18 వేల పైమాటే. ఈ భూమికి ఆనుకునే నగరానికి చెందిన ఓ స్థిరాస్తి వ్యాపారికి 30 ఎకరాలు ఉన్నాయి. నిజానికి ప్రభుత్వ భూమిలో పల్లెప్రకృతి వనం, క్రీడామైదానం కూడా ఏర్పాటు చేశారు. పల్లెపకృతి వనానికి ఏర్పాటు చేసిన రోడ్డు నుంచే రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ స్థిరాస్తి వ్యాపారి దాని వెనుక వైపు ఉన్న భూమిలో ఓ గుడి ఉందని, వెళ్లడానికి దారి కావాలని అధికారులను కోరారు. ఆ మేరకు పంచాయతీ కూడా తీర్మానం చేసింది. అడిగిందే తడవుగా అధికారులు ఏమీ ఆలోచించకుండా ప్రైవేటు వెంచర్‌కు ప్రభుత్వ (ఎకరానికి పైగా) భూమిలో నుంచి రహదారి ఏర్పాటు చేశారు.
- అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్‌ 176లో 12.37 ఎకరాల్లో చిన్న చెరువు శిఖం భూమి ఉంది. దీనికి ఆనుకుని 174,175 సర్వే నంబర్లలో శిఖం పట్టా భూములు ఉన్నాయి. వెంచర్‌ సైతం ఏర్పాటు చేశారు. ఈ భూములపై ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. విలువైన ఈ వివాదాస్పద భూములపై ఇటీవల ఓ రియల్టర్‌ కన్నేశాడు. వెంచర్‌కు వెళ్లేందుకు సరైన దారి కూడా లేకపోవడంతో తనకున్న పలుకుబడిని ఉపయోగించాడు. రైతులను సాకుగా చూపించి, ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి నుంచి 100 ఫీట్ల రోడ్డు ఇవ్వాలని అప్పటి రెవెన్యూ అధికారులను అభ్యర్థించాడు. ఆర్డీఓ, తహసీల్దార్‌, సర్వేయర్‌ రంగంలోకి దిగి కుంట్లూరు నుంచి తట్టి అన్నారం వెళ్లే మార్గం నుంచి సర్వే నంబర్‌ 207 ప్రభుత్వ భూమిలో 40 ఫీట్ల రోడ్డు (ఆరు గుంటలు) లెక్కించి దారి చూపించడం కొసమెరుపు.
- ఇబ్రహీంపట్నం మండలం నెర్రవల్లి సర్వే నంబర్‌ 26లోని సర్కారు భూమిలోని 8 ఎకరాలు రైతులకు అసైన్డ్‌ చేశారు. ఇదే సర్వే నంబర్‌లో మరో 2.1 ఎకరాల భూమి మిగిలి ఉంది. ఇందులో కొంత వరకు రాళ్లు, రప్పలు ఉండగా అప్పట్లో అధికారులు అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఈ భూమి చుట్టూ స్థిరాస్తి వెంచర్లు వెలిశాయి. ఇక్కడ ఎకరం భూమి ధర రూ.2 కోట్ల వరకు పలుకుతుంది. దీంతో రియల్‌ వ్యాపారులు ఈ భూమిని కబ్జా చేశారు. రైతుల పేరుతో ఇదే భూమి నుంచి ప్రైవేటు వెంచర్లకు రోడ్డు వేసుకున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అండగా నిలిచినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
- బాలాపూర్‌, హయత్‌నగర్‌, అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలాల సరిహద్దులోని నాగార్జునసాగర్‌ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గుర్రంగూడలో అటవీ భూములు ఉన్నాయి. మూడు లోక్‌సభ స్థానాల సరిహద్దు ప్రాంతం కూడా ఇదే. ఇక్కడ గజం రూ.లక్ష వరకు పలుకుతోంది. ఓ ప్రముఖ రియల్‌ ఎస్టేట్‌ సంస్థ ఈ అటవీ భూములకు ఆనుకుని సాహెబ్‌నగర్‌ కలాన్‌లోని పట్టా భూములు కొనుగోలు చేసింది. నిజానికి ఈ పట్టా భూములకు వెళ్లేందుకు దారి లేదు. వెంచర్‌ నిర్వాహకులు తమకున్న రాజకీయ పలుకుబడితో ఫారెస్ట్‌ భూమి నుంచి రోడ్డు ఏర్పాటుకు అనుమతి పొందారు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్ల మధ్య నుంచి రోడ్డుకు ఎలా అనుమతి ఇచ్చారనేది ప్రశ్నార్థకంగా మారింది.





మెరుపులతో ముగింపు..

విధ్వంసకర బ్యాటింగ్‌తో సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌ అభిమానులను మరోసారి అలరించింది. ఐపీఎల్‌ 17వ సీజన్‌లో లీగ్‌ దశను విజయంతో ముగించింది. ఉప్పల్‌ స్టేడియంలో ఆదివారం పంజాబ్‌ కింగ్స్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌ నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. ఉప్పల్‌ స్టేడియంలో సన్‌రైజర్స్‌ ఆడిన గత ఆరు మ్యాచ్‌లు రాత్రి వేళలో జరగ్గా.. ఈ మ్యాచ్‌ మధ్యాహ్నం జరిగింది. భానుడి భగభగలు లేకపోవడం అభిమానులకు పెద్ద ఊరట కలిగించింది. ఆకాశం మేఘావృతం కావడంతో మ్యాచ్‌ ఆద్యంతం అభిమానులు పూర్తిగా ఆస్వాదించారు. మ్యాచ్‌ ముగిశాక ప్యాట్‌ కమిన్స్‌ నాయకత్వంలోని సన్‌రైజర్స్‌ ఆటగాళ్లు అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ మైదానం చుట్టూ కలియతిరిగారు. – సాక్షి, హైదరాబాద్‌









మెట్రో ఫర్‌ యూ

రైళ్ల వేళలను సరిచేయాలంటున్న ప్రయాణికులు

- సికింద్రాబాద్‌ స్టేషన్‌ నుంచి భారీగా రాకపోకలు
- రాత్రి 11 తర్వాత అందుబాటులో లేని మెట్రోలు
- సోమ, శుక్రవారాల్లో ఉదయం 5కు, రాత్రి 11.45కు మాత్రమే ఒక మెట్రో
- మిగతా రోజుల్లోనూ ఇవే సమయాలను కొనసాగించాలని డిమాండ్‌



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ నుంచి ప్రతి రోజూ సుమారు 2 లక్షల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. వీరంతా నగరం నలువైపుల నుంచి సికింద్రాబాద్‌కు స్టేషన్‌కు చేరుకొనేవాళ్లే. చాలావరకు తెల్లవారుజామున 5 గంటల నుంచే రైళ్ల రాకపోకలు మొదలవుతాయి. ఇందుకనుగుణంగా మెట్రో సర్వీసుల వేళలను కూడా సవరించి ప్రయాణికులకు ప్రయోజనం చేకూరేలా మార్పులు చేయాలనే డిమాండ్‌ వినిపిస్తోంది. ప్రస్తుతం సోమ, శుక్రవారాల్లో ఉదయం 5 గంటలకు, రాత్రి 11.45 గంటలకు ఒక మెట్రో సర్వీసు చొప్పున ప్రయోగాత్మకంగా నడిపేందుకు హైదరాబాద్‌ మెట్రో రైల్‌ చర్యలు చేపట్టింది. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా మెట్రో వేళలను సైతం క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అనుసంధానం అవసరమే..

- సికింద్రాబాద్‌ స్టేషన్‌తో పాటు నాంపల్లి, బేగంపేట్‌, హైటెక్‌ సిటీ, లింగంపల్లి స్టేషన్‌ల నుంచి కూడా ప్రయాణికుల రాకపోకలు భారీగా పెరిగాయి. మహాత్మాగాంధీ, జూబ్లీ బస్‌స్టేషన్‌లు, ఎల్‌బీనగర్‌, ఉప్పల్‌ వంటి కూడళ్ల నుంచి కూడా తెల్లవారుజామున ప్రయాణికుల రాకపోకలు ఎక్కువే. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత నగరానికి వచ్చే రైళ్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ప్రస్తుతం నాగోల్‌ నుంచి రాయదుర్గం వరకు, ఎల్‌బీనగర్‌ నుంచి మియాపూర్‌ వరకు, ఎంజీబీఎస్‌ నుంచి జేబీఎస్‌ వరకు ప్రధాన రైల్వేస్టేషన్‌లకు మెట్రో స్టేషన్‌లు చాలా వరకు అందుబాటులోనే ఉన్నాయి. ఎల్‌బీనగర్‌, మియాపూర్‌ వంటి దూరప్రాంతాల నుంచి సికింద్రాబాద్‌,నాంపల్లి స్టేషన్‌లకు చేరుకోవచ్చు.
- హైటెక్‌ సిటీ నుంచి కూడా మెట్రో అందుబాటులో ఉంది. కానీ ఉదయంపూట సర్వీసులు లేకపోవడంతో ఆటోలు, క్యాబ్‌లలో రెట్టింపు చార్జీలు చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం నగరంలోని వివిధ మార్గాల్లో మెట్రో రైళ్లు ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతున్నాయి. రాత్రి 11 గంటలకు ఆఖరి రైలు చివరి స్టేషన్‌ నుంచి బయలుదేరుతోంది. వినాయక నిమజ్జన వేడుకలు,, క్రికెట్‌మ్యాచ్‌లు వంటి ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే మెట్రో వేళలను పొడిగిస్తున్నారు.కానీ రెగ్యులర్‌ ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉదయం 5 గంటల నుంచే రైళ్లను అందుబాటులో ఉంచితే ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

అర్ధరాత్రి వరకు డిమాండ్‌..

- కొంతకాలంగా నగరంలో సిటీలైఫ్‌ పెరిగింది. అర్ధరాత్రి వరకు వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. రెస్టారెంట్‌లు, మార్కెట్‌లు అందుబాటులో ఉంటున్నాయి. మరోవైపు నగరాన్ని సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు కూడా నచ్చిన ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఎక్కువ సమయం గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- కొత్త సచివాలయం కొలువుదీరిన తర్వాత ఆ భవనాన్ని, నెక్లెస్‌రోడ్డులోని అంబేడ్కర్‌ విగ్రహాన్ని, తెలంగాణ అమరుల స్మారకాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వారు రాత్రి పూట ఏ కొంచెం ఆలస్యంగా బయలుదేరినా గమ్యం చేరుకోవడం కష్టమే.
- రాత్రి 11 దాటిన తరువాత సిటీ బస్సులు అందుబాటులో ఉండడం లేదు. ఆటోవాలాలు ప్రయాణికులను దోచుకుంటున్నారు. రాత్రి సిటీకి చేరుకొనే దూరప్రాంతాల ప్రయాణికులకు, సిటీ నుంచి బయలుదేరేవారికి ప్రయాణం మరింత భారంగా మారింది.

డిమాండ్‌ మేరకు సర్వీసుల పెంపు..

ఈ క్రమంలో ప్రతి శుక్ర, సోమవారాల్లో ప్రయోగాత్మకంగా చేసిన మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల డిమాండ్‌ మేరకు సర్వీసులను రెగ్యులర్‌ చేయనున్నట్లు ఎల్‌అండ్‌టీ మెట్రో తెలిపింది. 'సాధారణంగా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే మెట్రో రైళ్లు అందుబాటులో ఉంటాయి. ప్రయాణికుల సౌకర్యం కోసం ట్రయల్‌ ప్రాతిపదికన సోమ, శుక్రవారాల్లో మాత్రమే సర్వీస్‌ వేళలను పొడిగిస్తున్నాం' అని అధికారులు స్పష్టం చేశారు. ఇదే వేళలను మిగతా రోజుల్లోనూ కొనసాగిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ దిశగా మెట్రో రైల్‌ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాసుల కరెంట్‌!

- ఎండలతో రికార్డు స్థాయిలో విద్యుత్‌ వినియోగం
- భారీగా బిల్లులు.. వినియోగదారుల గుండెలు గుభేల్‌
- రెండు నెలల్లోనే రూ.329 కోట్లు పెరిగిన ఆదాయం
- మొదటి స్థానంలో సైబర్‌సిటీ.. రెండో స్థానంలో మేడ్చల్‌

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్‌ బిల్లుల రూపంలో శివారు సర్కిళ్లు డిస్కంకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. కొత్త కనెక్షన్లకు తోడు గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో నమోదైన విద్యుత్‌ డిమాండ్‌ సంస్థకు భారీ ఆదాయాన్ని సమకూర్చింది. గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో ఫిబ్రవరితో పోలిస్తే మార్చిలో రూ.217 కోట్ల విలువైన విద్యుత్‌ను అధికంగా ఖర్చు చేయగా.. మార్చితో పోలిస్తే ఏప్రిల్‌లో రూ.112 కోట్ల విలువైన విద్యుత్‌ను అధికంగా వాడారు. పెరిగిన ఈ వినియోగం సంస్థకు కొంత లాభాలు తెచ్చిపెట్టగా, సగటు వినియోగదారులకు మాత్రం బిల్లుల భారం తప్పలేదు. కొంత మంది వినియోగదారులు మే నెలలో చేతికందిన (ఏప్రిల్‌ నెల) బిల్లును చూసి షాక్‌ తిన్నారు. ఫిబ్రవరిలో నెలవారి సగటు విద్యుత్‌ బిల్లులు రూ.687.22 కోట్లు రాగా మార్చిలో రూ.903.81 కోట్లకు చేరింది. ఏప్రిల్‌లో రూ.1016.92 కోట్లకు పెరిగింది. మే నెల బిల్లులు మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. నెలవారీ బిల్లుల వసూళ్లలో సైబర్‌సిటీ మొదటి స్థానంలో ఉండగా, మేడ్చల్‌ రెండో స్థానంలో నిలవడం గమనార్హం.

స్లాబ్‌ రేట్‌ మారి..

నగరం శరవేగంగా విస్తరిస్తుంది. శివారు ప్రాంతాల్లో నిర్మాణాలు జోరందుకున్నాయి. నెలకు సగటున కొత్తగా 2500 కనెక్షన్లు యాడ్‌ అవుతున్నాయి. వీటితోకి తోడు సాధారణ మధ్య తరగతి గృహాల్లోనూ ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్‌ మిషన్లు, ఓవెన్‌లు, గ్రీజర్లు సర్వ సాధారణ మయ్యాయి. ఫలితంగా విద్యుత్‌ వినియోగం కూడా భారీగా పెరుగుతోంది. గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 60 లక్షలకుపైగా విద్యుత్‌ కనెక్షన్లు ఉండగా, సాధారణ రోజుల్లో రోజుకు సగటున 55 మిలియన్ల విద్యుత్‌ వినియోగం జరిగేది. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడైంది. ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్ల వినియోగం రెట్టింపైంది. మార్చి నెలలో రోజు సగటు వినియోగం 70 నుంచి 75 మిలియన్‌ యూనిట్లు ఉండగా, ఏప్రిల్‌ చివరి నాటికి అనూహ్యంగా 85 నుంచి 90 ఎంయూలకు చేరుకుంది. అప్పటి వరకు నెలకు 150 యూనిట్ల లోపు వినియోగించిన వారు.. ఏప్రిల్‌ నెలలో ఏకంగా 250 యూనిట్లు దాటిపోయారు. స్లాబ్‌ రేటు పెరగడంతో బిల్లులు కూడా అమాంతం పెరిగిపోయాయి. మే నెలలో చేతికందిన బిల్లులు చూసి వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

ఆధార్‌తో ఆర్టీఏ

- ఆన్‌లైన్‌ పౌరసేవలు మరింత సులభం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ పౌరసేవలను మరింత సులభతరం చేసేందుకు రవాణాశాఖ కసరత్తు చేపట్టింది. వాహనదారులు నేరుగా వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రస్తుతం వివిధ రకాల పౌరసేవలను ఆన్‌లైన్‌ ద్వారా అందజేస్తున్నారు. ఇందుకోసం వాహనదారులు టీ–యాప్‌ ఫోలియోలో స్లాట్‌ నమోదు చేసుకొని అవసరమైన డాక్యుమెంట్లను అప్‌లోడ్‌ చేయాల్సి ఉంటుంది. త్వరలో ఈ ఆన్‌లైన్‌ పౌరసేవలను ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వాహనదారులు రవాణాశాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమకు అవసరమైన సేవలను పొందేందుకు మొదట ఆన్‌లైన్‌ నంబర్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది. తర్వాత వాహనదారుల మొబైల్‌ నంబర్‌కు వన్‌టైమ్‌ పాస్‌వర్డ్‌ (ఓటీపీ) వస్తుంది. ఓటీపీని నమోదు చేసిన అనంతరం తమకు కావాల్సిన పౌరసేవలను పొందేందుకు అవకాశం లభిస్తుంది. సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మరింత తేలిగ్గా ఆన్‌లైన్‌ సేవలను పొందేలా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తేనున్నారు.

52 రకాల సేవలు..

కొత్తగా లెర్నింగ్‌ లైసెన్సులు పొందడం నుంచి గడువు ముగిసిన వాటిని పొడిగించుకోవడం, డ్రైవింగ్‌ లైసెన్సులు, వాటి పునరుద్ధరణ, డూప్లికేట్‌ లైసెన్సులు, వాహనాల నమోదు, వాహనాల బదిలీలు, చిరునామా మార్పు, పర్మిట్‌లు, త్రైమాసిక పన్ను చెల్లింపులు, అపరాధ రుసుములు వంటి సుమారు 52 రకాల పౌరసేవలను రవాణాశాఖ అందజేస్తుంది. కొత్తగా లైసెన్సు తీసుకొనేవారు మొదట ఆర్టీఏలో నిర్వహించే లెర్నింగ్‌ పరీక్షలకు స్వయంగా హాజరు కావాల్సి ఉంటుంది. ఆ తర్వాత నెల రోజులకు శాశ్వత డ్రైవింగ్‌ లైసెన్సు తీసుకొనేందుకు మరోసారి డ్రైవింగ్‌ ట్రాక్‌లలో నిర్వహించే పరీక్షల్లో పాల్గొనాలి. ఈ రెండు రకాల లైసెన్సుల కోసం వాహనదారులు నేరుగా ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లవలసి ఉంటుంది. అలాగే వాహనాల నమోదు, ఫిట్‌నెస్‌ పరీక్షలు వంటి వాటి కోసం అధికారులను స్వయంగా సంప్రదించాలి. ఇవి కాకుండా చాలా వరకు ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు.

నక్ష బాట కబ్జాకు యత్నం



కందకం తవ్వి ఆందోళన తెలుపుతున్న రైతులు



కర్షకులతో మాట్లాడుతున్న విద్యుత్ యూనియన్ నాయకులు

రైతుల నిరసనతో ఆగిన వైనం

కందుకూరు: ఎన్నో ఏళ్లుగా నడిచే రోడ్డును కొందరు కబ్జా చేయడానికి యత్నించగా, రైతులు నిరసన తెలపడంతో నిలిచిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నేదునూరు గ్రామానికి సమీపంలోని సల్లోని బాయి అనే ప్రాంతంలో ఉన్న సుమారుగా 70 ఎకరాలకు పైగా ఉన్న పొలాన్ని విద్యుత్ ఉద్యోగులు సంఘంగా ఏర్పడి కొనుగోలు చేశారు. అందులో ఫాం ల్యాండ్ పనులు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామం నుంచి ఆ పొలం పక్కన 60 ఏళ్ల నుంచి నక్ష బాట ఉంది. ఆ బాటకు ఇరువైపులా ఆరు అడుగుల విస్తీర్ణంలో కాలువలు సైతం ఉన్నాయి. కాగా విద్యుత్ ఉద్యోగులు కొనుగోలు చేసిన పొలం పక్కన ఉన్న ఆ కాలువను పూడ్చి రోడ్డుపై కొంత భాగాన్ని ఆక్రమిస్తూ హద్దురాళ్లు పాతారు. దీంతో ఆగ్రహించిన స్థానిక రైతులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు ఆదివారం యూనియన్ ఉద్యోగులు చాలా మంది కార్లలో తమ పొలానికి వచ్చారు. విషయం తెలుసుకున్న రైతులు పొలాలకు వెళ్లే రోడ్డుపై అడ్డంగా కందకం తవ్వి అక్కడే నిరసన తెలిపారు. దీంతో ఆ యూనియన్ నిర్వాహకులు దిగివచ్చి, గతంలో ఉన్న మాదిరే రహదారిని వదిలిపెడతామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించి కందకాన్ని పూడ్చి వేసి నిరసన విరమించారు.

ఆవుదూడల పట్టివేత

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న ఆవుదూడలను యాచారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తుని నుంచి సాగర్‌రోడ్డుపై ప్రైవేట్ వాహనంలో పశువులను శనివారం రాత్రి నగరంలోని జియాగూడకు అక్రమంగా తరలిస్తున్నారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా 25 ఆవుదూడలను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. కాకినాడకు చెందిన డ్రైవర్ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. పశువులను నగరంలోని గోశాలకు తరలించినట్లు, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాల్ తెలిపారు.

నేటి నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్

శంషాబాద్: పట్టణంలోని మినీస్టేడియంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. హిమబిందు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఈ నెల 20 నుంచి 30 వరకు దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దోస్త్ వెబ్‌సైట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజేంద్రనగర్ అని ఉంటుందన్నారు. బీఏ, బీఎస్సీ,బీకాం కంప్యూటర్‌అప్లికేషన్, కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వివరాలకు 9441956233, 9494812040 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పిడుగుపాటుకు జాగ్రత్తలే ముఖ్యం

- వర్షం కురిసినప్పుడు చెట్ల కిందకు వెళ్లొద్దు
- మెరుపులను చూసేందుకు ప్రయత్నించొద్దు

షాబాద్: వేసవి పూర్తి కాక ముందే అకాల వర్షాలు కురుస్తున్నాయి. బలమైన ఈదురుగాలులతో వాన పడేటప్పుడు మెరుపులు వచ్చి పెద్ద శబ్దాలతో పిడుగులు పడతాయి. వీటికి బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. అందుకే మనుషులతో పాటు జంతువులు చనిపోతాయి. పిడుగుల ప్రభావానికి పచ్చని చెట్లు సైతం కాలిపోతుంటాయి. ఎక్కువగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులే పిడుగుపాటుకు బలవుతుంటారు.

పిడుగు అంటే?

ఆకాశం కారుమబ్బులతో నిండినప్పుడు మబ్బు పైభాగంలో ధనశక్తి, కింది భాగంలో రుణశక్తి ఉంటాయి. ఈ రెండు ఆకర్షణకులోనై అత్యధిక విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. చుట్టూ ఉన్న గాలిలో సుమారుగా 30 వేల డిగ్రీల సెంటిగ్రేడ్ వేడి ఉత్పత్తి అవుతుంది. అదే మెరుపు. ఇలా వేడెక్కిగాలి ఒక్కసారిగా వ్యాకోచం చెందితే పెద్ద శబ్దం వస్తే అదే ఉరుము. ఒక్కోసారి మెరుపుతో కూడిన విద్యుత్ భూమి మీదకు చేరుతోంది దాన్నే పిడుగు అంటారు. చర్మం జలదరింపునకు గురవుతున్నా.. దగ్గర్లో లోహ వస్తువులు ఊగుతున్నా పిడుగుపాటుకు సంకేతంగా భావించాలి.

మిలియన్ మెగావాట్ల శక్తి

వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ఆకాశంలో ఉరుములు, మెరుపులు వస్తుంటే చెట్ల కిందకు, విద్యుత్ టవర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి వెళ్లొద్దు. పిడుగుపడే సమయంలో ఆకాశంలోని మెరుపులు అత్యధిక శక్తిని కలిగి ఉంటాయి. కాబట్టి ఆ వెలుతురును చూసేందుకు ప్రయత్నించవద్దు. పిడుగుకు కొన్ని మిలియన్ మెగావాట్ల శక్తి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలి.



మృతి చెందిన కాడెద్దుల వద్ద బోరున విలపిస్తున్న రైతు కుటుంబం

సమయస్ఫూర్తితో ఉండాలి

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. ఒకవేళ వీలు కాకపోతే సమయస్ఫూర్తితో వ్యవహరించి.. మోకాళ్లపై చేతులు, తల పెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. దీనివల్ల సమీపంలో పిడుగు పడినా అందులోని విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి బతికేందుకు అవకాశాలు ఉంటాయి. పిడుగు పడుతుందని అనిపించినప్పుడు రబ్బర్ చెప్పులు వేసుకోవడం మంచిది. ఒకవేళ వేసుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు కాలును భూమి మీద పూర్తిగా అనించొద్దు. కాలి వేళ్ల మీద ఉండేందుకు ప్రయత్నించాలి.

విద్యుత్ పరికరాలకు నష్టం

పిడుగు పడినప్పుడు విద్యుత్ పరికరాలను ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఉరుములు, మెరుపులు వస్తుంటే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలైన టీవీ, రిఫ్రిజిరేటర్, సెల్‌ఫోన్ వంటి వాటిని వినియోగించకపోవడం ఉత్తమం. అలాగే మెరుపులు వస్తున్నప్పుడు ఆరుబయట స్నానం చేయడం, వంట పాత్రలు కడగడం చేయవద్దు. లోహపు వస్తువుల ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

మాడ్గులలో కాడెద్దులు మృతి

మాడ్గుల: మండలంలోని గిరికొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు సంబంధించి కాడెద్దులు ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్ వ్యవసాయ పనుల నిమిత్తం రెండు కాడెద్దులను తన పొలం వద్దకు తీసుకెళ్లారు. ఇంతలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం రావడంతో పిడుగు పడింది. దీంతో కాడెద్దులు అక్కడిక్కడే మృతి చెందాయి. తనకు రూ.70 వేల నష్టం వాటిల్లిందని రైతు బోరున విలపించారు. ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


సూర్యుడి కన్నా ఎక్కువ వేడి



సూర్యుడి ఉపరితలం మీద 5వేల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటే.. పిడుగు పడినప్పుడు 29 వేల డిగ్రీలు ఉత్పత్తి అవుతుంది. పిడుగుకు సూర్యుని ప్రభావం కన్నా 5 రెట్లు ఎక్కువ వేడి ఉంటుంది.

– డాక్టర్ దామోదర్, జిల్లా ఉపవైద్యాధికారి

ముట్టుకుంటే షాక్ రాదు



పిడుగుపాటుకు గురైన వ్యక్తిని ముట్టుకుంటే షాక్ రాదు. వెంటనే బాధితుడికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించాలి. పిడుగుల సమయంలో విద్యుత్ పరికరాల కనెక్షన్ తీసివేయడం మంచిది.

– నరేందర్‌నాయక్, విద్యుత్ ఏఈ, షాబాద్

అప్రమత్తత అవసరం



మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నప్పుడు రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. వాతావరణ పరిస్థితులను బట్టి వెంటనే అప్రమత్తం కావాలి. పశువులను, మేకలు, గొర్రెలను చెట్ల కింద ఉంచకూడదు. రైతులు సైతం చెట్లకు దూరంగా ఉండాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, పశువైద్యాధికారి, రేగడిదోస్వాద

లారీ ఢీకొని.. యువకుడి మృతి



సత్రజిత్ దాస్ (ఫైల్)

పహాడీషరీఫ్: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన శశికాంత దాస్, అతని స్నేహితుడు సత్రజిత్ దాస్ అలియాస్ బుదదాస్(25)లు బతుకుదెరువు నిమిత్తం తుమ్మలూర్ గ్రామానికి వచ్చి స్థానికంగా ఉన్న పాలీప్లాస్ట్ కంపెనీలో పని చేస్తున్నారు. శనివారం సాయంత్రం సత్రజిత్ దాస్‌తో పాటు పరిచయస్తుడైన శృషాంత్ దాస్(35)లు తుక్కుగూడలో సామగ్రి తీసుకొచ్చేందుకు కంపెనీకి చెందిన బైక్‌పై వెళ్లి, తిరుగు ప్రయాణంలో దేవేంద్ర విద్యాలయ వరకు రాగా నిర్లక్ష్యంగా యూటర్న్ తీసుకుంటున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి సత్రజిత్ మృతి చెందాడు. శృషాంత్ చికిత్స తీసుకుంటున్నాడు. లారీ డ్రైవర్ శేఖర్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రౌండప్ చేసి.. గొలుసు కొట్టేశారు

బంజారాహిల్స్: మద్యం మత్తులో ఉన్న నలుగురు ప్రయాణికులు పథకం ప్రకారం మరో ప్రయాణికుడిని చుట్టుముట్టి చాకచక్యంగా మెడలో ఉన్న గొలుసు తస్కరించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్డునెంబర్ 11 లోని ఉదయ్ నగర్‌లో నివసించే ఏసుదాసు (35) ప్రభుత్వ ఉద్యోగి. ఈ నెల 17న సాయంత్రం ఆరు గంటలకు మెహిదీపట్నంలో 49ఎమ్ బస్సు ఎక్కి కేర్ ఆసుపత్రి బస్‌స్టాప్‌లో దిగేందుకు మెట్లవద్దకు వచ్చాడు. అదే సమయంలో మద్యం మత్తులో ఉన్న నలుగురు వ్యక్తులు ఏసుదాసు దిగేందుకు యత్నిస్తుండగా రౌండప్ చేశారు. మీదపడుతూ న్యూసెన్స్ చేస్తుండగా ఏసుదాసు హెడ్‌సెట్ కిందపడిపోయింది. దాన్ని తీసుకునే క్రమంలో ఈ నలుగురు చాకచక్యంగా అతని మెడలో ఉన్న రెండున్నర తులాల గొలుసును కట్‌చేసి జారుకున్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత మెడలో గొలుసుకోసం చూడగా కనిపించకపోవడంతో ప్రయాణికుల్లాగా బస్సు ఎక్కిన నలుగురు పథకం ప్రకారం చోరీ చేసి ఉంటారని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బర్మా దేశస్తుడి దుర్మరణం

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో బర్మా దేశస్థుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మౌనిక వివరాల ప్రకారం... బర్మా దేశానికి చెందిన ఇస్లాం (35), అబ్దుల్లా (30)లు నగరానికి వలస వచ్చి బాలాపూర్ ప్రాంతంలో ఉంటూ సెంట్రింగ్ పనులు చేస్తున్నారు. టోలిచౌకి ప్రాంతంలో శనివా రం రాత్రి సెంట్రింగ్ పనులు ఉండటంతో ద్విచక్ర వాహనంపై బాలాపూర్ నుంచి ఆరాంఘర్ మీదుగా ప్రయాణమయ్యారు. అత్తాపూర్ రోడ్డు వద్దకు రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇస్లాంకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన అబ్దుల్లాను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

అడ్డగుట్ట: స్నానం చేయడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లిన నవ వధువు ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందింది. ఈ ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ షాహీద్ పాషా తెలిపిన మేరకు.. లాలాపేటలోని ఆర్యనగర్ ప్రాంతానికి చెందిన మౌనిక(26)కు నాచారం లోని చిలుకనగర్ ప్రాంతానికి చెందిన రమేష్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. శనివారం మౌనిక తండ్రి తన కూతురు, అల్లుడిని ఆర్యనగర్‌లోని తన ఇంటికి తీసుకొచ్చాడు. అల్లుడు రమేష్ రాత్రి వరకు ఉండి భోజనం చేసి వెళ్లిపోయాడు. మరుసటి రోజు మధ్యాహ్నం మౌనిక స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లి బోర్‌కు మోటర్ ఆన్ చేసింది. దీంతో విద్యుత్ ఘాతానికి గురై పెద్ద కేకలు వేసి పడిపోయింది. వెంటనే కుటుంబసభ్యులు బాత్‌రూమ్‌లోకి వెళ్లే ప్రయత్నం చేయగా వారికి కూడా షాక్ కొడుతుండడంతో వెంటనే మెయిన్ ఆఫ్ చేసి మౌనికను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బోర్ మోటర్‌కు సంబంధించిన వైర్లు తెగిపోయి ఉన్నాయని, సరిగా టేప్ కూడా వేయకపోవడంతో షార్ట్ సర్క్యూట్‌కు గురై ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

నా భార్య హింసిస్తోంది.. రక్షణ కల్పించండి

ఓ ఇంగ్లీష్ ప్రొఫెసర్ ఆవేదన

సుల్తాన్‌బజార్: తన భార్య నుండి తనకు, తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని ఓ బాధిత భర్త పోలీసులకు కోరారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు టిమూజియన్ తన తల్లిదండ్రులతో కలిసి మాట్లాడారు. తనకు లక్ష్మీ గౌతమితో వివాహం అయినప్పటి నుండి ఆమె తనను మానసికంగా శారీరకంగా హింసిస్తుందని ఆయన తెలిపారు. తన ఒంటిపై భార్య చేసిన గాయాలను చూపిస్తూ మీడియాతో తన గోడును చెప్పుకున్నారు. ఏపీ రాజోలుకు చెందిన టిమూజియన్‌కు అమాలాపురానికి చెందిన లక్ష్మీ గౌతమితో ఏడేళ్ల క్రితం పెళ్లి జరిగినట్లు తెలిపాడు. నగరంలోని మల్లారెడ్డి కాలేజీలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ భార్యతో కలిసి అల్వాల్‌లో నివాసం ఉంటున్నట్లు వివరించారు. తమకు ఐదేళ్ల కుమారుడు ఉన్నాడని పేర్కొన్నాడు. అయితే పెళ్లి అయినప్పటి నుండి తనను అకారణంగా తన భార్య హింసిస్తుందని వాపోయాడు. పలు మార్లు పెద్దల సమక్షంలో మాట్లాడినా తీరు మారలేదన్నారు. ఇటీవల తనను చంపేందుకు తనపై దాడి చేసినట్లు తెలిపాడు. ఈ విషయమై స్థానిక అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని అయితే పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. మహిళలకు ఒక చట్టం, పురుషులకు ఒక చట్టం ఉంటుందా అని ప్రశ్నించారు. తనకు, తన తల్లిదండ్రులకు తన భార్యతో ప్రాణహాని ఉందని, తమను పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు.

దూసుకొచ్చిన మృత్యువు

లారీ ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడి దుర్మరణం

- తీవ్ర విషాదంలో కుటుంబసభ్యులు, విద్యార్థులు



శ్రీరాములు (ఫైల్)

మంచాల: రోడ్డు ప్రమాదం ఓ నిండు ప్రాణాన్ని బలికొంది. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పే ప్రభుత్వ ఉపాధ్యాయుడు అనంత లోకాలకు చేరుకొని అటు కుటుంబ సభ్యులు, ఇటు విద్యార్థులను తీవ్ర విషాదంలోకి నెట్టి వేశాడు. ఈ హృదయ విదాకర సంఘటన మంచాల మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రవి నాయక్ కథనం ప్రకారం.. యాచారం మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన బట్టు శ్రీరాములు(40) వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ప్రస్తుతం ఆయన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇంజాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఆదివారం ఉదయం స్వగ్రామం నుంచి బైక్‌పై సోదరిని చూడటానికి యాదాద్రి భువనగిరి జిల్లా మర్రిగూడ మండలం కుదాభక్షపల్లికి బయలు దేరారు. మార్గమధ్యలో రంగాపూర్ ఎక్స్‌రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా అతి వేగంగా వస్తున్న ఓ లారీ ఆయన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆయన మరణం తీరని లోటు

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచిన శ్రీరాములు లోటు తీరనిదని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్ పేర్కొన్నారు. శ్రీరాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేవలం ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు బోధించడమేగాకుండా సమాజం పట్ల గౌరవంతో శ్రీరాములు మెలిగారని గుర్తు చేశారు.

వివాహితతో సహజీవనం చేస్తూ చిత్రహింసలు

నిందితుడి అరెస్ట్

బంజారాహిల్స్: ఓ వివాహితతో సహజీవనం చేస్తూ ఆమెను అడ్డుగా పెట్టుకుని పలువురిని బెదిరించి కేసులు పెట్టించి డబ్బు దండుకునేందుకు యత్నించడమే కాకుండా ఆమెను తీవ్రంగా కొట్టిన ఘటనలో నిందితున్ని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. ఖమ్మం జిల్లా మధిర మండలం, సిరిపురం గ్రామానికి చెందిన కొనకంచి కిరణ్ కుమార్(34)పై పలువురిని బెదిరించిన ఘటనలో నగరంలోని పలు పోలీస్ స్టేషన్లల్లో 8 కేసులు నమోదై ఉన్నాయి. శ్రీకృష్ణానగర్‌లో అద్దెకు ఉంటున్న కిరణ్ కుమార్ సమీపంలో ఒక ఇంట్లో పనిచేస్తున్న ఒక వివాహితతో రెండు సంవత్సరాల క్రితం పరిచయం పెంచుకున్నాడు. నిన్ను, నీ పిల్లల బాగోగులు చూసుకుంటానంటూ చెప్పాడు. మాయమాటలతో ఆమెను లోబర్చుకున్నాడు. ఇటీవల పక్కింట్లో నివసిస్తున్న ఓ యువకుడితో ఆమె మాట్లాడుతుండగా చూసిన కిరణ్ కుమార్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఆమెతో ఫిర్యాదు చేయించి తనపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని చెప్పించాడు. సదరు యువకుడిని బ్లాక్ మెయిల్ చేశాడు. ఇలాంటి అబద్ధాలు ఎందుకంటూ ఆమె కిరణ్ కుమార్‌ను నిలదీసింది. ఈ విషయంలో ఇద్దరి మధ్యా తీవ్ర వాద్వాదం జరిగింది. దీంతో కక్ష పెంచుకున్న కిరణ్ కుమార్ ఈ నెల 17న తన గదిలో తాళ్లతో ఆమెను మంచానికి కట్టేసి తీవ్రంగా కొట్టాడు. కడుపులో తన్నాడు. ఆమె విలవిలాడుతుండగానే అలాగే వదిలేసి పారిపోయాడు. కట్లు విప్పుకుని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు గతంలో కూడా జైలుకు వెళ్లొచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నియామకం



గుర్రంపల్లి ఉదయ్ కుమార్ శ్యామల్‌రాజు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన గుర్రంపల్లి ఉదయ్ కుమార్ శ్యామల్‌రాజు తెలంగాణ దళిత బంధు రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బచ్చలకూర బాలరాజు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్య నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి



యాచారం: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్



షాద్‌నగర్: సుందరయ్యకు జోహార్లు తెలుపుతున్న నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్

యాచారం: పుచ్చలపల్లి సుందరయ్య తన చివరి శ్వాస వరకు పేదల సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో ఆదివారం సుందరయ్య వర్ధంతిని పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అధ్యక్షతన నిర్వహించారు. మొదట సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో భాస్కర్ మాట్లాడుతూ.. పుచ్చలపల్లి సుందరయ్య దేశం గర్వించదగిన మహనీయుడని కొనియాడారు. దేశం ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో సాధారణ వ్యక్తి లాగా పోయి పేదల సమస్యలపై మాట్లాడి దేశాన్ని ఆలోచన చేసే విధంగా చైతన్యం కల్పించిన మహానేత ఆయన అన్నారు. ఆయన కృషితో నేడు సీపీఎం పార్టీ పేదల బాగు కోసం, వారి సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందని ప్రకటించారు. ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజానాట్యమండలి మాజీ రాష్ట్ర కార్యదర్శి జగన్, జిల్లా కమిటీ సభ్యుడు పి.అంజయ్య, నాయకులు బ్రహ్మయ్య, జంగయ్య, తావునాయక్, వినోద్‌కుమార్, వెంకటయ్య, జంగయ్య, లాజర్, అరుణ, పుష్ప పాల్గొన్నారు.

గొప్ప పోరాటయోధుడు

షాద్‌నగర్: పుచ్చలపల్లి సుందరయ్య గొప్ప పోరాటయోధుడని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సుందరయ్య అని అన్నారు. పేదలకు భూమి కావాలని, వెట్టిచాకిరి నుంచి విముక్తి కలగాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి పది లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేయించారని అన్నారు. అదేవిధంగా కుల వ్యవస్థకు వ్యతిరేకంగా గ్రామాల్లో పోరాటం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ సుందరయ్య ఆశయాల సాధన కోసం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయక్, వెంకటరమణ, నర్సింలు, ఈశ్వర్ నాయక్, సత్యం, కురుమయ్య, చంద్రమౌళి, శివారెడ్డి, రాజశేఖర్, రాజు, పద్మారెడ్డి, జంగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.